



Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 90 | శనివారం 30 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## జపాన్, భారత్
# కలిస్తే అద్భుతాలే

**- టోక్యోలో ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రధాని మోదీ ప్రసంగం**
**- ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపే చూస్తోందన్న ప్రధాని**
**- త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ధీమా**

జపాన్- సూర్య వాస్తవం, ఆగస్టు 29

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలు కేవలం మన వృద్ధిని గమనించడమే కాకుండా మనపై గట్టి నమ్మకంతో ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జపాన్ పర్యటనలో ఉన్న మోదీ... టోక్యోలో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ ఫోరంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం భారతదేశంలో

- మిగతా 2లో..

## సత్యం-అహింస ముందు
# అసత్యం-హింస నిలబడలేవు

**- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ**

హైదరాబాద్- సూర్య వాస్తవం, ఆగస్టు 29



బీహార్ లోని కాంగ్రెస్ శ్రేణులపై బీజేపీ దాడిపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. సత్యం-అహింస అంతిమ విజయం సాధిస్తాయని, వాటి ముందు అసత్యం,హింస నిలబడలేవని ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. దాడులు మా యాత్రను అడ్డుకోని నిలుపుదల చేయలేవని, నిజాన్ని, రాజ్యాంగాన్ని రక్షించడానికి తమ పోరాటం కొనసాగుతుందని, సత్యమే జయతే అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల ఓట్ అధికార్ యాత్ర నిర్వహించారు. ఆ ర్యాలీలో ఓ వ్యక్తి ప్రధాని మోడీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఇవాళ బీజేపీ ర్యాలీ చేపట్టింది.

పాట్నాలోని కాంగ్రెస్ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ దుశ్చర్యను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులపై బీజేపీ నాయకులు జెండా కర్రలతో దాడి చేశారు.

## చైనాతో సంబంధాల
# బలోపేతానికి భారత్ సిద్ధం

**- పరస్పర గౌరవం, ప్రయోజనాలే కీలకం అన్న ప్రధానమంత్రి మోదీ**
**- జపాన్ పర్యటనలో ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడి**
**- ఎస్సీఓ సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు ప్రధాని పయనం**
**- భారత్-చైనా బంధం ప్రపంచ శాంతికి దోహదపడుతుందని వ్యాఖ్య**
**- ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఇరు దేశాల కలయిక అవసరం**



జపాన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 29

భారత్, పొరుగు దేశమైన చైనాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలు, పరస్పర సున్నితత్వం అనే మూడు కీలక సూత్రాల ఆధారంగా వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృష్టితో ఈ బంధాన్ని బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం రెండు రోజుల జపాన్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, శుక్రవారం ఓ వార్తా సంసకు ఇచ్చిన ఇంటర్వ్యూలో

- మిగతా 2లో..

## స్కూళ్లు, కాలేజీల్లో
# ఫేషియల్ రికగ్నిషన్..

**- విద్యావ్యవస్థపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు**
**- స్కూళ్లు, కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరుకు సీఎం ఆదేశం**
**- విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి కొత్త విధానం వర్తింపు**
**- విద్యాసంస్థల నిర్మాణ పనులన్నీ ఒకే ఏజెన్సీకి అప్పగింత**
**- బాలికల పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచన**

హైదరాబాద్ - సూర్య వాస్తవం, ఆగస్టు 29



తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కొత్త విధానం ద్వారా హాజరు శాతం మెరుగు పడటంతో పాటు, వృత్తి విద్యా సంస్థల్లోని లోపాలను సరిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్నిచోట్లా మౌలిక వసతులను మెరుగుపరిచి, మెరుగైన బోధనా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

విద్యాశాఖ పరిధిలో అదనపు తరగతి గదులు, వంటశాలలు, టాయిలెట్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను వేర్వేరు ఏజెన్సీలకు అప్పగించడం

- మిగతా 2లో..



## ఉత్తరాఖండ్‌పై మరోసారి
# మేఘాల విస్ఫోటనం

డెహ్రాడూన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 29

ఉత్తరాఖండ్‌పై మరోసారి మేఘాల విస్ఫోటనం (క్లౌడ్ బరెస్ట్) విరుచుకుపడింది. రుద్రప్రయాగ్, చమోలి, భగేశ్వర్ మరియు తెహ్రీ జిల్లాలపై గురువారం అర్ధరాత్రి క్లౌడ్ బరెస్ట్‌తో భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు, మెరుపు వరదలతో ఐదుగురు మరణించగా, పలువురు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. సుమారు 30-40 కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకున్నాయని, పలు ఇళ్లు ధ్వంసమయ్యాయని అన్నారు. సహాయక చర్యల కోసం పలు బృందాలను తరలించామని అన్నారు. నివేదిక ప్రకారం.. రుద్రప్రయాగ్ జిల్లాలోని తెండ్వాల్ గ్రామంలో మెరుపువరదలతో ఒక మహిళ శిథిలాల కింద చిక్కుకుని మరణించింది. చమోలి జిల్లాలోని దెవాల్‌లో ఇద్దరు మరణించగా, సుమారు 20 పశువులు శిథిలాల కింద చిక్కుకున్నాయి. భారీ వర్షాలతో

- మిగతా 2లో..



## గడువు పెంపుపై
# 8న విచారిస్తాం

**- బీహార్ ఓటర్ల క్లెయిమ్‌లను 15 వరకు స్వీకరించాలన్న పిటిషన్లపై సుప్రీం**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 29

బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) సందర్భంగా ముసాయిదా జాబితా నుండి తొలగించబడిన ఓటర్లు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను తెలియచేయడానికి సెప్టెంబరు 1వ తేదీగా ఉన్న గడువును 15 వరకూ పొడిగించాలని కోరుతూ ఆర్‌జెడి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ సహా పలు రాజకీయ పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై సెప్టెంబరు 8న విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.

అభ్యంతరాలు స్వీకరించడానికి గడువును సెప్టెంబరు 15వరకు పొడిగించాల్సిందిగా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాల్సిందిగా ఆ పార్టీలు

- మిగతా 2లో..

## ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి
# లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

**- ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు**
**- దేశానికి ఫ్రూట్ కేపిటల్, ఆక్వా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ఉందన్న ముఖ్యమంత్రి**
**- రూ. 200 కోట్లు దాటిన ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని వెల్లడి**
**- 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్న సీఎం**
**- 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద ముందుకు రావాలని యువతకు పిలుపు**




అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 29

ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకెళుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

- మిగతా 2లో..



## జగన్ కోసమే మోదీ
# సీబీఐ గొంతు నొక్కారు

**- వివేకా హత్య కేసుపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు**
**- మోదీకి జగన్ దత్తపుత్రుడంటూ తీవ్ర విమర్శలు**
**- అన్ని ఆధారాలున్నా దోషులకు శిక్ష పడటం లేదని ఆవేదన**

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## చైనాతో సంబంధాల

# బలోపేతానికి భారత్ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి

ఈ ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు తాను జపాన్ నుంచి నేరుగా చైనాలోని టియాంజిన్ నగరానికి వెళ్లనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అక్కడ జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నట్లు ఆయన వెల్లడించారు. గత ఏడాది కజన్‌లో అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలలో సానుకూల పురోగతి కనిపిస్తోందని మోదీ గుర్తు చేశారు.

"భూమిపై అతిపెద్ద దేశాలు, పొరుగున ఉన్న భారత్-చైనాల మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు కొనసాగితే, అది కేవలం ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచ శాంతి, శ్రేయస్సుకు కూడా ఎంతో మేలు చేస్తుంది," అని ప్రధాని అభిప్రాయపడ్డారు. బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచం ఏర్పడటానికి ఇది చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అస్థిరతను ప్రస్తావిస్తూ, ఆర్థికంగా బలమైన దేశాలైన భారత్-చైనా కలిసి పనిచేయడం ఎంతో అవసరమని మోదీ నొక్కిచెప్పారు. ప్రపంచ ఆర్థిక క్రమానికి స్థిరత్వం తీసుకురావడంలో ఇరు దేశాల భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత పర్యటనకు రావడం, ఇప్పుడు ప్రధాని మోదీ చైనాకు వెళ్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## జపాన్, భారత్

# కలిస్తే అద్భుతాలే

(మొదటి పేజీ తరువాయి

రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, పారదర్శక విధానాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ మనదే'' అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు కేవలం పెరగడమే కాకుండా, అవి రెట్టింపు అవుతున్నాయని ఆయన వివరించారు. భారత్, జపాన్ మధ్య భాగస్వామ్యం కేవలం వ్యూహాత్మకమే కాదని, అదొక స్మార్ట్ బంధమని ప్రధాని అభివర్ణించారు. ఈ రెండు దేశాల కలయిక ఆసియా శతాబ్దంలో స్థిరత్వం, వృద్ధి, శ్రేయస్సును నిర్దేశిస్తుందని ఆయన అన్నారు.

సాంకేతిక రంగంలో భారత్, జపాన్ కలిసి పనిచేసే అవకాశాలపై మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఏఐ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్, అంతరిక్ష రంగాల్లో భారత్ ఎంతో ధైర్యమైన, ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపట్టింది. జపాన్ సాంకేతికత, భారత ప్రతిభావంతుల మేధస్సు కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహించవచ్చు" అని మోదీ తెలిపారు. ఈ రెండు దేశాల ఉమ్మడి ప్రయోజనాలు ఉమ్మడి శ్రేయస్సుగా మారాయని, జపాన్ వ్యాపారాలకు భారత్ ఒక మంచి వేదిక అని ఆయన పేర్కొన్నారు.

## స్కూళ్లు, కాలేజీల్లో

# ఫేషియల్ రికగ్నిషన్..

(మొదటి పేజీ తరువాయి

సరైన పద్ధతి కాదని సీఎం అన్నారు. నాణ్యత, పర్యవేక్షణ, నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ఈ నిర్మాణ పనులన్నింటినీ ఒకే విభాగానికి అప్పగించాలని ఆదేశించారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కే (ఈడబ్ల్యుఐడీసీ) ఈ బాధ్యతలు అప్పగించాలని ఆయన తేల్చిచెప్పారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను గ్రీన్ ఛానెల్ ద్వారా తక్షణమే క్లియర్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని హెచ్చరించారు. అదేవిధంగా, 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కింద చేపట్టిన పారిశుద్ధ్య పనుల బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, వంట కోసం సోలార్ ప్యానెళ్లతో కూడిన కంటైనర్ కిచెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించిన సీఎం, అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను (పీఈటీలు) నియమించుకోవాలని తెలిపారు. సంక్షేమ గురుకులాల్లోని బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించడంపైనా సమావేశంలో చర్చించారు. విద్యా రంగంపై చేసే ఖర్చును పెట్టుబడిగా భావించాలని సీఎం అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులే చదువుతున్నందున, గత 10 ఏళ్లలో చదివిన వారి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

## జగన్ కోసమే మోదీ

# సీబీఐ గొంతు నొక్కారు

**- వివేకా హత్య కేసుపై వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు**

**- మోదీకి జగన్ దత్తపుత్రుడంటూ తీవ్ర విమర్శలు**

**- అన్ని ఆధారాలున్నా దోషులకు శిక్ష పడటం లేదని ఆవేదన**

**అమరావతి- సూర్య వాస్తవం, ఆగస్టు 29**

తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విషయంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడని, అందుకే జగన్‌ను, ఆయన సోదరుడు అవినాశ్ రెడ్డిని కాపాడటం కోసం మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసు దర్యాప్తును ప్రస్తావిస్తూ, ఈ కేసులో మళ్లీ విచారణ ఎందుకు చేపట్టరని ప్రభుత్వాన్ని షర్మిల సూటిగా ప్రశ్నించారు. "వై నాట్?" అంటూ నిలదీశారు. ఇన్నేళ్లుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న పోరాటంలో పూర్తి న్యాయం ఉందని, ఆమెకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ పనితీరుపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "సీబీఐ అనేది మోదీ చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. నిజంగా సీబీఐ చిత్తశుద్ధితో పనిచేసి ఉంటే ఈపాటికే దోషులకు శిక్ష పడేది" అని అన్నారు. హత్య జరిగినప్పుడు సంఘటనా స్థలంలో అవినాశ్ రెడ్డి ఉన్నారని చెప్పడానికి గూగుల్ మ్యాప్ లొకేషన్లతో సహా బలమైన ఆధారాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇన్ని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ, అవినాశ్ రెడ్డిని కాపాడటానికే దర్యాప్తును నీరుగారుస్తున్నారని ఆమె ఆరోపించారు. సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందని షర్మిల పేర్కొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఏపీకి

# లక్ష కోట్ల పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)




ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో ఈ రంగాల్లో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆహార శుద్ధి రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని, భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం ఆహార శుద్ధిలో ఆంధ్రప్రదేశ్ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని, దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని తెలిపారు. అదేవిధంగా 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వా హబ్‌గా ఉందని స్పష్టం చేశారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ లో అవకాశాలు- ప్రోత్సాహకాలు**

ఆంధ్రప్రదేశ్‌లో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విస్తృతమైన మౌలిక సదుపాయాలు కూడా ఆంధ్రప్రదేశ్ సొంతమని పెట్టుబడిదారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేందుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఆహారం, పానీయాల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, సుగంధ ద్రవ్యాలు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఆహార శుద్ధి రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

**ఆహారపు అలవాట్లు- మారుతున్న జీవన శైలితో పెట్టుబడులకు అవకాశాలు**

ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఆహార శుద్ధి రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. వన్ ఫ్యామిలి -వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆహారం, పానీయాల రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇస్తామని అన్నారు. అగ్రిటెక్ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. ట్రేసబిలిటి, సర్టిఫికేషన్, ప్యాకేజింగ్ లాంటి సవాళ్లపై దృష్టి పెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మరోవైపు భారత్‌లో తయారయ్యే ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ బ్రాండ్స్‌గా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందమైన విశాఖ ఇప్పుడు దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా ఖ్యాతి గడించిందన్నారు. త్వరలోనే సీ కేబుల్, డేటా సెంటర్లు కూడా విశాఖలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. ఏపీలో ఆహార శుద్ధి సహా వ్యవసాయాధారిత పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులను ప్రోత్సహించేందుకు అమరావతిలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఏర్పాటు కా నుండటం సంతోషదాయకమని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీలో ఫుడ్ మాన్యుఫాక్చరింగ్‌పై చర్చలు**

ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ మూడో ఎడిషన్‌లో ఏపీలో విలువ జోడించిన ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఆక్వా రంగంలో బ్రీడింగ్, నాణ్యమైన ఫీడ్, వ్యాధుల నియంత్రణ, ఎక్స్‌పోర్ట్ లింకేజిపై పారిశ్రామిక వేత్తలు, నిపుణులు, పరిశోధకులు చర్చించారు. పంట ఉత్పత్తి అనంతర నష్టాల నివారణ, స్మార్ట్ కోల్డ్ చెయిన్, లాజిస్టిక్స్ సదుపాయాలపై దృష్టి పెట్టే అంశంపైనా చర్చలు జరిగాయి. డైరీ, పౌల్ట్రీ, మాంసం ప్రాసెసింగ్ యూనిట్ల ఆటోమేషన్, ఎగుమతి ప్రమాణాలపై సదస్సులో చర్చించారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు టీజీ భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎగుమతిదారులు, నిపుణులు హాజరయ్యారు.

# గడువు పెంపుపై 8న విచారిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత న్యాయస్థానాన్ని కోరాయి. పిటిషనర్ అయిన ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరపున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, నేహా రాథి శుక్రవారం నాడు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్‌ముందు ఈ విషయాన్ని మౌఖికంగా ప్రస్తావించారు. ఆధార్ కార్డుతో ఓటర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఈ నెల 22న ఉత్తర్వులిచ్చింది, ఆ తర్వాత నుండి క్లెయిమ్‌లు గణనీయంగా పెరిగాయి. ఆగస్టు 22నుండి 27వ తేదీ నాటికి ఇటువంటి క్లెయిమ్‌లు 84,305 నుంచి 1,78,948కి పెరిగాయని ఆర్‌జెడి తెలిపింది. కేవలం ఆధార్‌తోనే దరఖాస్తు చేశారంటూ జిల్లాల వ్యాప్తంగా అధికారులు తిరస్కరించిన క్లెయిమ్‌లు చాలా వున్నాయని పేర్కొంది. ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేర్చాలంటే ఫారమ్ 6ను అందజేయాలంటూ పోలింగ్ కేంద్రాల అధికారులు పట్టుబడుతున్నారని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పేర్కొంది. ఫారమ్ 6 అంటే కొత్త ఓటర్లు లేదా ఒక నియోజకవర్గం నుండి మరో నియోజకవర్గానికి బదిలీ అయిన వారు అందజేసేది. ఆధార్ కార్డులతో పెట్టిన క్లెయిమ్‌ల వివరాలు, పోలింగ్ కేంద్రం ఏజెంట్లు తీసుకుని పోలింగ్ కేంద్రం అధికారులకు అందజేసినప్పటికీ ఎన్నికల కమిషన్ రోజువారీ స్టేటస్ రిపోర్టులో కనిపించడం లేదని ఆర్‌జెడి పేర్కొంది. దీనివల్ల రాజకీయపార్టీల ఏజెంట్లు సహకరించడం లేదనే తప్పుడు భావన తలెత్తుతోందని ఆర్‌జెడి పిటిషన్ పేర్కొంది. ఇసి వైఖరికి ప్రతిగా ఆగస్టు 25న బిఎల్‌ఓల వివరాలను ట్వీట్ చేయడానికి ప్రయత్నించామని తెలిపింది. అయినా ఇసి తన రోజువారీ స్టేటస్ రిపోర్టును సరిదిద్దుకోలేదని పేర్కొంది. 28న ప్రచురించిన స్టేటస్ రిపోర్టులో ఆర్‌జెడి కేవలం మూడు క్లెయిమ్‌లు పెట్టినట్లు చూపించారని ఆ పిటిషన్ పేర్కొంది. పైగా బీహార్‌లో వరదల ప్రభావం తీవ్రంగా వున్నందున తొలగించబడిన ఓటర్ల జాబితా వెరిఫికేషన్ కష్టమవుతోందని ఆర్‌జెడి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీలు పేర్కొన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో గడువును సెప్టెంబరు 15వరకు పొడిగించాలని కోరాయి.

## ఉత్తరాఖండ్‌పై మరోసారి

# మేఘాల విస్ఫోటనం

(మొదటి పేజీ తరువాయి)

భగేశ్వర్ జిల్లాలోని పౌసారి గ్రామంలోని పలు నివాసాలపై కొండచరియలతో పాటు బండరాళ్లు దొర్లిపడ్డాయి. ఈ ఘటనలో ఒక మహిళ శిథిలాల కింద చిక్కుకుని మరణించింది. ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం అర్థరాత్రి నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీంతో రహదారులు దెబ్బతిన్నాయని నివేదికలు తెలిపాయి. ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేశారని అన్నారు. ఏడు చోట్ల రహదారులు దిగ్బంధించబడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని అన్నారు. పర్యాటకులు పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయారని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.

## ఏఐతో ఎన్నో

# ఉపాధి అవకాశాలు ఉన్నాయి

## - నారా లోకేష్



**విశాఖ - సూర్య వాస్తవం, ఆగస్టు 29**

పారిశ్రామిక విప్లవం చూశాం. ఇప్పుడు ఏఐ (కృత్రిమ మేధ) విప్లవం చూస్తాం అని మంత్రి నారా లోకేష్ అన్నారు. నేడు సైయెంట్ ఆధ్వర్యంలో విశాఖలో ఏఐ ల్యాబ్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పారిశ్రామిక విప్లవం చూశాం, ఇప్పుడు ఏఐ విప్లవం చూస్తాం. రానున్నది ఏఐ విప్లవం. ఏఐతో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయి, వస్తున్నాయి. భవిష్యత్తులో ఉన్నతంగా వెళ్లాలి. అందుకు లక్ష్యంతో ముందుకు సాగాలి. దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నిరంతరం కష్టపడుతున్నారు. నేను మొదటిసారి పోటీ చేసినప్పుడు ఓడిపోయాను. ఐదేళ్లు కష్టపడ్డాను గెలిచాను. నన్ను విద్యాశాఖ తీసుకోవద్దని కొందరు చెప్పారు. కానీ కష్టమైన విద్యాశాఖ తీసుకుని మార్పు తీసుకుని రావాలని ప్రయత్నం చేశాను. విద్యాశాఖలో సంస్కరణలు తెచ్చాను. విద్యార్థులే మన ఆస్తి, మన భవిష్యత్. దక్షిణ భారతదేశంలో లెర్నింగ్ టెక్నిక్‌లో మన రాష్ట్రం ముందు ఉంది' అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. 'రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహించాం. కొత్త టీచర్ నియామకాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ నుంచి కొత్త టీచర్లు విధుల్లో చేరుతారు. పుస్తకాలు మీద ఎవరి బొమ్మలు ఉండవు. కొన్ని పార్టీలకు ఈ అభివృద్ధి నచ్చడం లేదు. వారు వచ్చి నన్ను కలిసి మాట్లాడచ్చు. జీవితంలో ఉపాధ్యాయులను మరచి పోవద్దు. నేను నా గురువులను మరచిపోలేను. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్ ఆట కట్టించారు మన ప్రధాని. యుద్ధంలో మృతి చెందిన మురళి నాయక్ మన రాష్ట్రం వారే. వారి తల్లి తండ్రులను నేను కలిసి మాట్లాడాను. వారిలో దేశభక్తి మాటలు నన్ను కదిలించాయి. దేశం కోసం పని చేసే జవానులను మనం ఎప్పుడు గౌరవించాలి' అని లోకేష్ చెప్పారు.

## సంపాదకీయం

### ప్రకృతి ప్రకోపాన్ని తగ్గించలేమా...



ప్రకృతి సంకేతాలను నిర్లక్ష్యం చేసినా, నిర్లిప్తంగా మెదిలినా, భక్తి శ్రద్ధ, గౌరవాలను విస్మరించినా అనర్థాలు తప్పవనే చర్చలు కొత్త కాదు. కానీ నూరేళ్ళకో, 30 ఏళ్లకో ఇంతటి వరద విశ్వరూపాన్ని చూశామని బురద ఎండిపోయే దాకా కొన్ని దినాలు చెప్పుకొని అంతటితో వదిలేస్తే, మరలా తీరని వరదల నష్టం సంభవించదనే హామీని ఎవరూ ఇవ్వలేరు. సముద్ర జలాలు లేని తెలంగాణ వరద జలాలతో శోక సంద్రమైం ది. కామారెడ్డిలో మొదటి అంతస్తు భవనాలను వరద నీరు ముంచేయడం ఏమిటీ? కామా, ఫుల్ స్టాప్ లేని వరదలు ఏ ప్రదేశాన్నయినా ఎపుడైనా తీవ్ర ఉధృతితో కబళించొచ్చనే సంకేతాలేనా? అనేవి విస్మ య ప్రశ్నలుగా మిగిలిపోతున్నాయి. ఈ ప్రశ్నలకు అనేక జవాబులు, విశ్లేషణలు, కారణాలు, వాదనలు రకరకాలుగా పోటెత్తుతున్నాయి. కామారెడ్డి, మెదక్, ములు గు సహా అనేక చోట్ల వరద గాయం 360 డిగ్రీల్లో మామూలుగా లేదు. ఎక్కడికక్కడ మానవ స్వార్థాలు, తప్పిదాలకు తోడు లో పభూయిష్ట విధానాలు స్ఫురణకు రావొ చ్చు. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా రెండు రోజుల్లోనే సాధారణ వర్షపా తా నికి అనేక రెట్లు అధికంగా కుండపోత కురిసింది. అది గణాంకాల్లో 60 సెంటీ మీటా ర్ల మేర అయినప్పుడు ఎవరేం చేస్తారనే నిట్టూర్పులూ పారొచ్చు. నీటి కోసం రా ష్ట్రాల మధ్యరా జుకున్న వివాదాల ధ్వని వినిపిస్తుండగానే.. ఎటుచూసినా అదే నీరు ఏరులై పారి నేలను, ఆస్తులను, పంటలను ముంచెత్తడం చూస్తున్నాం. ఉదాహరణకు మనం బండిని సరిగ్గా నడిపిస్తే అది మన ల్ని క్షేమంగా గమ్యానికి చేరుస్తుంది. అయి తే అదే బండిని సక్రమంగా నడపకుండా, విచక్షణకు తిలోదకాలు ఇచ్చి ఇష్టారీతిన వాడేస్తే ఏదో ఒక ఘడియలో మొరాయిస్తుంది. సకాలంలో చేర్చాల్సిన చోటుకు చే ర్చకపోగా, ఆ బండిని తిరిగి మనమే మో యాల్సి వస్తుంది. వర్షం, వరదల నిర్వహణపై మనకు సోయి ఎలా ఉండాలనేది చె ప్పేందుకు ఈచిన్న థియరీచాలు.ప్రకృతి సంకేతాలను నిర్లక్ష్యం చేసినా, నిర్లిప్తంగా మెదిలినా, భక్తి శ్రద్ధ, గౌరవాలను విస్మరించినా అనర్థాలు తప్పవనే చర్చలు కొత్త కాదు. కానీ 30 ఏళ్లకో, నూరేళ్లకో ఇంతటి వరద విశ్వరూపాన్ని చూశామని బురద ఎండిపోయే దాకా కొన్ని దినాలు చెప్పుకొని అంతటితో వదిలేస్తే, మరలా తీరని వరదల నష్టం సంభవించదనే హామీని ఎవరూ ఇవ్వలేరు. తాత్కాలిక, సమీప, దీర్ఘకాలిక ప్రణాళికల యుక్తి కచ్చితంగా ఉండాలి.పాలకులు, ప్రతిపక్షాల పరస్పర నింద లు వేసుకోవడం చూస్తూనే ఉంటాం. వారి మాటల కుండపోతలకు తక్కువేం ఉండ దు. పదేళ్ళలో వారేం చేశారంటే.. ఎక్కువ కాలం పాలించిన, ఇపుడూ పాలన చేస్తున్న వారిదే పాపం అనే సారాంశంగా మాటకు మాట పోటెత్తుతుంది. ఈ రొటీన్ తీరుకు నీరొదిలి.. నీళ్లను కాపాడటానికి అదే సమయంలో ఇలాంటి గండాలు పునరావృతం కాకుండా ఉపాయాలు యోచించాలి.మ న పాలకుల విధానాలు భలే ఉంటాయి. రూ.వేల కోట్లతో కొత్త ప్రాజెక్టుల కట్టడంపై చూపించినంత ఆసక్తి.. ఇప్పటికే ఉన్నవాటి నిర్వహణ కోసం వెచ్చించడానికి మాత్రం మనసు రాదు. వందకు పైగా సంవత్సరాల చరిత్ర ఉన్న పోచారం డ్యామ్‌ను ఈసారి అత్యధిక వరద ముంచెత్తింది. సు మారు 1.82 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్టు ఓ అంచనా. ఇలాంటి జలాశయాల పటిష్టానికి మాత్రం నాయకులు ముందుకు రారు. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం ము గుస్తుందనగా వరదలు కొత్త దారులను వెతుక్కోవడం చూస్తున్నాం. తెలంగాణలో గడిచిన 48 గంటల్లో ఆయా చోట్ల 200 మి.మీ. నుంచి 440 మి.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు జలాశయం సామర్థ్యం సుమారు 2 టీఎంసీలు. అలాంటి ప్రాజెక్టులకు సరిపడా ఎన్నో టీఎంసీల నీరు దారి తప్పి వృథా అవడమే కాకుండా అనేక కష్టనష్టాలను చుట్టు ముట్టించింది.రాష్ట్రంలో గడిచిన రెండు రోజుల్లో మొత్తంగా సగటున 29.1 మి. మీ. వర్షపాతం రికార్డయింది. ఆగస్టు 21 నుంచి 27 వరకు వారం రోజుల్లో చాలా జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం నమోదైంది. ఆగస్టు సాధారణ సగటు వర్షపాతం సుమారు 210 మి.మీ. (ఒక నెల మొత్తం) కాగా.. గత రెండు రోజుల్లో కురిసిన వర్షం చూసుకుంటే దాదాపు 3-4 రె ట్లు ఎక్కువగా ఉంది. కామారెడ్డి, మెదక్, ములుగు జిల్లాల్లో 200 నుంచి -400 మి. మీ. వరకు పెద్ద మొత్తంలో వర్షం కురిసింది.ఇది సాధారణంతో పోలిస్తే 10 రె ట్లు ఎక్కువ. కామారెడ్డి జిల్లాలో బుధవా రం అర్గొండలో 418.3 మి.మీ., రాజంపేటలో 440. 5 మి.మీ. వర్షం, కామారెడ్డి టౌన్‌లో 308. 5 మి.మీ, భిక్నూర్‌లో 238 మి.మీ., లింగంపేటలో 120.3 మి. మీ., టెక్మాల్‌లో 183.3 మి.మీ., హవేలీఘనపూర్‌లో 316 మి.మీ. వర్షపాతం నమో దైంది. ఇది కచ్చితంగా సాధారణ వర్షాలు మాత్రం కావు. గత కొన్ని రోజులుగా మే ఘ విస్ఫోటం అనే పదం ఎక్కువగా వినిపిస్తుంది. రెండు నుంచి 4 గంటల్లో ఒకే ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదవ్వడాన్ని మేఘ విస్ఫోటం అని పిలుస్తారు. ఇలాంటివి ప్రకృతి వైపరీత్యాల వల్లే ఎక్కువగా సంభవిస్తున్నాయి.బెంగాల్ బేలో ఏర్పడిన సైక్లోనిక్ స ర్క్యులేషన్ కారణంగా తెలంగాణలో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. నివాస ప్రాం తాలు, రవాణా మార్గాలు, రైల్వే లైన్లు, కాలువల గుండా తీవ్ర వరదలు సంభవించాయి. అనేక నివాసాలు, వాహనాలు, రోడ్లు, పంటలు, సామాజిక ఆస్తులు ప్రభావితమయ్యాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎ ఫ్ సహాయక బృందాలు కాపాడటం లో నిమగ్నమయ్యాయి.విపరీత వర్షాలు వ చ్చిన సమయంలో సమాజానికి ఇబ్బంది లేకుండా, అలాగే వరద నీరు వృథా కా కుండా ఆ నీటిని ఒడిసిపట్టుకునే ఉపాయాలపై నిరంతరం దృష్టి ఉంచాలి. నాలా ల పునరుద్ధరణ, కాలువల్లో వ్యర్థాలు, ఆక్రమణల తొలగింపు వంటి సంస్కరణలతో జల ప్రవాహాలను సులభం చేయాలి. రాజధాని మొదలు చిట్ట చివరి టౌనూ, మం డలం వరకూ ఆసాంతం ప్రకృతి ధర్మానికి అనుగుణంగా ప్రణాళికా యుక్తి కావాలి.



# ఎవ్వరినీ క్షమించేదే లే...

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో చాలా మార్పు కనిపిస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంలో దృష్టి పెట్టడం పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మూడు దఫాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తీసుకోని రాజకీయ పరమైన నిర్ణయాలు ఈ సారి మాత్రం తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు కానీ ఏమైనా తప్పులు చేస్తే వెంటనే చర్యలకు దిగేవారు కాదు. దానిపై సాగదీసేవారు. నాడు సోషల్ మీడియా ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో అటువంటి ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలను వేసేవారు. పార్టీ వారినే పంపి అందులో నిజాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. అయితే అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించారు. అంతే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలు చాలా తక్కువనే చెప్పాలి. ఎక్కువగా పార్టీ క్రమశిక్షణ కమిటీ, నిజనిర్ధారణ కమిటీలను నియమించి కాలయాపన చేస్తూ ఆ ఘటన మర్చిపోయిన తర్వాత షరా మామూలయ్యేది. కానీ ఇప్పుడు అలా కాదు. వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల విషయం తెలిసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఉండేవి కావని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఇక గతంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఆందోళనలు చేసినా వెంటనే స్పందించే వారు కాదు. అలాగే విపక్ష నేతలు వెళ్లి అక్కడ పర్యటనలు చేసినా పట్టించుకునే వారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై



ఆయన కఠినంగా వ్యవహరించారు నాడు. కానీ నేడు అలా కాదు. ఏ మాత్రం నిరసనలు, ఆందోళనలు కనిపించినా వెంటనే చంద్రబాబు రియాక్ట్ అవుతు న్నారు. మిరప, పొగాకు, చిత్తూరు మామిడి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో విపక్ష నేత అక్కడ పర్యటనలకు చేయకముందే ఆ సమస్యపై స్పందించారు. తాజాగా దివ్యాంగులను నెలకు పదిహేను వేల రూపాయల పింఛన్లు తొలగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆందోళనకు దిగితే వెంటనే స్పందించి అర్హులైన అందరికీ ఇస్తామని ఆయనే చెప్పారు. ఇక స్మార్ట్ మీటర్ల విషయంలోనూ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు కమర్షియల్ భవనాలకే పరిమితం చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. చంద్రబాబులో వచ్చిన ఈ మార్పు చూసిన పార్టీ సీనియర్ నేతలు మాత్రం ఆశ్చర్యపోతున్నారు

**దసరాకు 6 లక్షల మందికి గృహప్రవేశాలు**

. దసరా పండగకు భారీ బహుమతి ఇచ్చేందుకు సిద్ధమయింది. మూడు లక్షల ఇళ్ల లో గృహప్రవేశాలు చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం పూర్తి కావడంతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల ఆదరిభామానాలను చూరగొనే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా ఈ దసరా పండగ నాడు మూడు లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దసరాకు మూడు లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు చేయించడంతో పాటు రానున్న సంక్రాంతి నాటికి మరో రెండు లక్షల ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు చంద్రబాబు ఆదేశించారు.

అంటే ఈ ఏడాది దాదాపు ఐదు లక్షల మంది ఇళ్లులేని పేదలకు సొంత ఇంటి కల సాకారమవుతుందని భావిస్తున్నారు. సొంత ఇంటికోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం తీపికబురు అందించినట్లయింది. వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పది లక్షల మందికి సొంత ఇళ్లను సమకూర్చాలన్న ఉద్దేశ్యంలో ప్రభుత్వం ఉంది.

. ఇందుకు అనుగుణంగా కేటగిరీలుగా విభజించి వాటిని పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో జరిపిన సర్వే ప్రకారం ఇప్పటి వరకూ ఆరు లక్షల మందికి సొంత ఇళ్లు కావాలని తేలింది. దీంతో వచ్చే ఏడాదికి ఆరు లక్షల మందికి సొంత ఇళ్లను అందించేలా ప్రణాళికలను రూపొందించారు. ఈ మేరకు అధికారులు పనులను ముమ్మరంపూర్తి చేశారు. ఇప్పటికే అనేక గృహాలు నిర్మాణానికి తుది దశకు చేరుకున్నాయి. మరికొన్నింటిలో చిన్న చిన్న పనులు ఉన్నాయి. అవి దసరా నాటికి పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అదే సమయంలో నిధులకు సంబంధించిన ఇబ్బందులు కూడా లేకపోవడంతో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

# పవర్ యత్నాలు...

**విశాఖపట్టణం - సూర్య వాస్తవం**

జనసేన మూడు రోజుల పండగకు కొనసాగుతోంది. విశాఖ నగరం ఇందుకు వేదిక అయింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడు రోజుల పాటు విశాఖ నగరంలోనే ఉండనున్నారు. జనసేన హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించిన తర్వాత తొలిసారి ఇంత భారీ స్థాయిలో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం పూర్తి కావడంతో పాటు పార్టీ శ్రేణులు, నేతల్లో నెలకొన్న నైరాశ్యం పారదోలేందుకు పవన్ కల్యాణ్ ఈ సమావేశాల నుంచి ప్రయత్నించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ శ్రేణులు ఈ సమావేశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పవన్ కల్యాణ్ ఈ సమావేశాల నుంచి ఏం సందిస్తారన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకునే ప్రయత్నం పవన్ కల్యాణ్ చేయనున్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో వాటి ప్రభావం ఎంత మేరకు ప్రజల్లో ఉందన్న అంచనాలకు కూడా ఈ సమావేశం ఉపయోగపడు తుందని భావిస్తున్నారు. పార్టీ అంతర్గత విషయాలపై కూడా పవన్ కల్యాణ్ పార్టీ నేతలలో చర్చించనున్నారు. ఇందులో ప్రధానంగా నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నేతల మధ్య సఖ్యత, సమన్వయం, సహకారం గురించి అడిగి తెలుసుకోనున్నారు. పదవుల విషయాన్ని పక్కన పెడితే అధికారుల తీరు గురించి కూడా ఆరా తీయనున్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి పది మంది చొప్పున ముఖ్య నేతలతో కూడా పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు. ముఖాముఖి నిర్వహించే ఈ కార్యక్రమంలో 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి నేతలు పాల్గొంటారు. వారితో నియోజకవర్గాల్లో కూటమి పరిస్థితితో పాటు విపక్ష వైసీపీపై ఎలాంటి అభిప్రాయం ఉందన్న విషయాన్ని కూడా పవన్ కల్యాణ్ తెలుసుకోనున్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో



జనసేన పార్టీని బలోపేతం చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలు కూడా తీసుకుంటారు. అలాగే పార్టీ ఎమ్మెల్యేలతో జరిగే సమావేశాల్లో గత ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలు పెండిరగ్ లో ఉన్నవాటిపై కూడా పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలతో చర్చించనున్నారు. ప్రధానమైన హామీల పరిష్కారానికి అవసరమైన నిధులు విడుదల చేయడానికి ఆయన ఈ సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలుపు దిశగా పయనింప చేయడానికి పవన్ కల్యాణ్ ఈ ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది.

# కుప్పంలో హిందల్కో

**తిరుపతి - సూర్య వాస్తవం**

అంతర్జాతీయ అల్యూమినియం తయారీ సంస్థ హిందల్కొ ఆంధ్రప్రదేశ్‌లో అడుగిడుతోంది. హిందాల్కో ఇండస్ట్రీస్ ముఖ్యమంత్రి చంద్రబాబుమ నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో పెట్టుబడిపెడుతోంది. రూ. 586 కోట్లతో ఒక అత్యాధునిక అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది కేవలం అల్యూమినియం ఉత్పత్తులను మాత్రమే కాదు, యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్‌ల ఛాసిస్ (బాడీ) లను ప్రత్యేకంగా తయారు చేస్తుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించలేదు కానీ.. కుప్పంలో ప్లాంట్ ఏర్పాటు దాదాపు ఖరారు అయింది.కుప్పంలో ఉన్న పాత అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ప్లాంట్‌ను కొనుగోలు చేసిన హిందల్కొ అక్కడ తన కార్యకలాపాలు మొదలుపెడుతుంది. ఏపీ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీ పాలసీ 2025%-%30 కు అనుగునంగా ఈ సంస్థ ఏర్పాటవుతోంది. 2026 చివరి నాటికి నిర్మాణం పూర్తవుతుందని.. 2027 నుంచి కార్యకలాపాలు మొదలవుతాయని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.




ఈ ఫెసిలిటీ ద్వారా షుమారు 600 ఉద్యోగాల కల్పన జరుగుతుంది. బెంగళూరులోని ఫాక్స్‌కాన్ ఫెసిలిటీకి కుప్పం సమీపంలో ఉంటుంది. ఈ అనుకూలతను ఉపయోగించుకుని కుప్పంలో యూనిట్ ప్రారంభం అవుతోంది.ఈ ప్రాజెక్ట్ కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాదు. "మేక్ ఇన్ ఇండియా" మరియు "మేక్ ఫర్ ది వరల్డ్" అంటున్న భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఇది ఒక ముందడుగు. ఇంతకు ముందు ఐఫోన్ విడిభాగాలను దిగుమతి చేసుకుని ఇక్కడ అసెంబ్లింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ ఫోన్లలో ఉపయోగించే చాసిస్‌ను ఇక్కడే తయారు చేస్తుండటం ఐఫోన్ మేకింగ్ ఇన్ ఇండియా డ్రీమ్‌లో కీలకమైన అంశం.ఆదిత్య బిర్లా గ్రూప్ లో ఒక ప్రముఖ సంస్థ అయిన హిందాల్కో, అల్యూమినియం మరియు రాగి ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది.. ఆటోమొబైల్స్, విమానాలు, ప్యాకేజింగ్ మరియు ఎలక్ట్రానిక్స్ వంటి అనేక రంగాలకు ఈ సంస్థ కీలకమైన ఉత్పత్తులను అందిస్తుంది.యాపిల్ ఫోన్ల తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారు. తైవాన్‌కు చెందిన ఈ ఎలక్ట్రానిక్ కాంట్రాక్ట్ కంపెనీ భారత్‌లో విస్తరణకు ప్రణాళికలు వేసుకుంటోంది. ఇప్పటికే ఏపీలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. శ్రీ సిటీలో ఫాక్స్‌కాన్‌ను అసెంబ్లింగ్ యూనిట్ ఉంది. అప్పట్లో ఇక్కడ ఐఫోన్ టెస్టింగ్, అసెంబ్లింగ్ చేశారు. ఇంకా శ్రీపెరంబదూర్, బెంగళూరులో కూడా ఫాక్స్‌కాన్ ఫెసిలిటీస్ ఉన్నాయి.

ఇటీవలనే యూపీలో యూనిట్ ప్రారంభించడానికి సన్నాహకాలు చేస్తున్నారు. అయితే వియత్నాం తరహాలో పెద్ద ఎత్తున మాన్యుఫాక్చరింగ్ చేసేందుకు ఫాక్స్‌కాన్ సిటీని నిర్మించాలని ఆ కంపెనీ యోచిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం చాలా రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి.ఇప్పటికే కుప్పంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు కొన్ని ఉన్నాయి. హిందాల్కో అక్కడ అడుగుపెడితే.. మరిన్ని పరిశ్రమలు అక్కడకు రావడానికి ఆస్కారం ఉంది. ఈ మధ్యనే నెల్లూరు%-% బెంగళూరు హైవే నుంచి కుప్పంకు నాలుగు వరుసల రహదారి నిర్మించారు. బెంగళూరుకు అతి దగ్గరగా ఉండటంతో దీనిని పారిశ్రామిక కేంద్రంగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నారు.

# టాప్ - 6లో జిల్లా ఉండాలి

- అన్న క్యాంటీన్లలో, మున్సిపాలిటీలలో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి
- అన్ని చెరువులకు నీరందించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలి
- అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, ఆగస్టు 29 :** అన్న క్యాంటీన్లలో, మున్సిపాలిటీలలో పరిశుభ్రత, ఇతర అంశాల్లో అనంతపురం జిల్లా రాష్ట్రంలో టాప్ -6లో ఉండేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. శుక్రవారం అనం తపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పెన్షన్లు, అన్న క్యాంటీన్లు, మున్ని పాలిటీలలో శానిటేషన్, ఇరిగేషన్, ఐసిడిఎస్, యూరియా, విద్యుత్‌శాఖ, ఏపీఐఐసి భూ సమస్యలు, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్, తదితర శాఖల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల అమలులో రాష్ట్రంలో అనంతపురం జిల్లా 4వ స్థానంలో నిలవడం పట్ల మున్సిపల్ కమిషనర్లకు అభినందనలు తెలిపారు. అన్న క్యాంటీన్లలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాణ్యత మరింత పెంచాలన్నారు. సానుకూల ప్రజా అవగాహనకు సంబంధించి మున్సిపల్ సేవల పరిధిలో రోజు ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా, మీ పరిధిలో చెత్తకుప్పలను 24 గంటలలోపు తొలగిస్తున్నారా లేదా, మున్సిపాలిటీలో డ్రైనేజీలు పరిశుభ్రం చేస్తున్నారా అన్న అంశాలకు సంబంధించి మరింత పురోగతి చూపించాలని, పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్లు పరిశీలన చేయాలన్నారు. రోజు ఇంటి నుంచి చెత్త సేకరించాలని, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాల న్నారు. ఈ అంశంలో జిల్లా రాష్ట్రంలో టాప్ 6లో ఉండేలా పనిచేయాలన్నారు. ఒకటవ తేదీన పెన్షన్ల పంపిణీకి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో 304 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉండగా, ప్రతి చెరువులకు నీరు నింపేలా, భూగర్భజలం పెంచేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వచ్చే వారం రోజుల్లో 50 చెరువులకు నీరు నింపేలా చూడాలని మైనర్ ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని దానిని కొనసాగించాలని, రైతు సేవ కేంద్రాలు, డిసిఎంఎస్‌లలో అవసరమైన చోట ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు సేవ కేంద్రాలలో, ప్రైవేట్ చోట ఎరువుల అమ్మకాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు మానిటర్ చేయాలన్నారు. ఎరువుల అమ్మకాలను రికార్డ్ చేస్తున్నారా లేదా అనేది చూడాలని, ఎక్కడైనా ఎరువుల నిల్వ అయిపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఒక హెక్టార్ కు ఎంత ఎరువులు కావాలి అనేది రైతులకు అవగాహన కల్పించా లన్నారు. జాయింట్ టాస్క్ ఫోర్స్ తోపాటు తాము కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం జరుగుతుందని, అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు తీసుకో వాలన్నారు. జిల్లాలో 21 సబ్ స్టేషన్ లో ఉండగా, వాటి చుట్టూ భూమి తీసుకుని సోలార్ ప్లాంట్లు పెట్టి గ్రీన్ ఎనర్జీని జనరేట్ చేయడం కోసం పీఎం కుసుమ్ కింద 111 మెగావాట్ల సోలార్ జనరేషన్ కోసం అవసరమైన 499.5 ఎకరాలకు సంబంధించిన భూమి అవసరమవుతుందని, ఇందుకు సంబంధించి ప్రైవేట్ భూమిని రైతుల దగ్గర కొంటామని కంపెనీ వారు చెబుతున్నారని, ఇందుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో తాము కూడా ఒక సబ్ స్టేషన్ తనిఖీ చేయడం జరుగుతుందని, ఆర్డీఓలు కూడా వారి పరిధిలో సబ్ స్టేషన్లను తనిఖీ చేయాలని, వారం రోజుల్లోపు భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీఎస్పీసీఎల్ పరిధిలో అల్ట్రా మెగా సోలార్ పార్క్ కోసం అవసరమైన భూమిని సేకరించాలన్నారు. గుంతకల్లు, సింగనమల, రాయదుర్గం నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఒక్కోచోట 50 ఎకరాల భూమిని గుర్తించాలని తహసీల్దారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నాటసారా రహిత జిల్లాగా అనంతపురం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 29 :** నాటసారా రహిత జిల్లాగా అనంతపురం జిల్లాని ప్రకటించడమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో నవోదయం 2.0 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 104 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. నాటుసారా నిర్మూలనపై ఎప్పటికప్పుడు రైడ్స్ చేయాలన్నారు. ఎక్సైజ్ పోలీస్ అధికారులు కూడా వేగవంతంగా ఆలోచించి నాటుసారాని దూరం పెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులోభాగంగా నవోదయం 2.0, నాటసార నిర్మూలన కార్యక్రమం.. కంట్రోల్ రూమ్ నంబర్ 14405.. నాటసారాని తరిమికొడదాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ ఎక్సైజ్ శాఖ రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, సునీల్, సాగర్, సోమశేఖర్, సునీత, జయనాథ రెడ్డి, ఎస్ఐ జకీర్ పాల్గొన్నారు.

## నేటి నుండి మంచినీరు సజావుగా సరఫరా



**కదిరి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 29 :** కదిరి ప్రాంతానికి మునిసిపల్ మంచినీటి సరఫరా కు నిరంతరం అంతరాయం కలుగుతున్న తరుణంలో తాగునీటి పంపింగ్ ప్రాంతంలోని పార్నపల్లి నుండి వచ్చే హౌస్ పంప్ లో రెండు మోటార్లు ఉండగా ఒక మోటార్ గత వారం కారిపోవడంతో తాగునీటి సరఫరా కు అంతరాయం కలుగుతున్న సమయంలో కదిరి శాసనసభ్యులు చొరవ తీసుకొని 6.5 లక్షల వ్యయంతో నూతనంగా మోటారును అమర్చడంతో మంచినీటి సరఫరాకు అంతరాయానికి చెల్లుబాటు అయిందని కదిరి మున్సిపల్ చైర్పర్సన్ దిల్షాదునిషా బహుద్దిన్ తెలిపారు, నేటి నుండి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వార్డుల వారీగా నీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు, సకాలంలో సహకరించిన మున్సిపల్ కమిషనర్, డి, ఈ, ఏ,ఇ వర్క్ ఇన్స్పెక్టర్లు, మరియు వాటర్ వర్క్స్ సిబ్బంది కి మున్సిపల్ చైర్ పర్సన్ అభినందనలు తెలియజేశారు.

## అంగన్వాడీ సేవలపై అవగాహన




**అనంతపురం - సూర్య వాస్తవం, ఆగస్టు 29:** అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి గ్రామ సమీపంలో జోగుల గుడిసెలకు సీడీపీఓ ఉమా శంకరమ్మ ఆధ్వర్యంలో సూపర్వైజర్ భారతి, అంగన్వాడీ టీచర్లు శుక్రవారం సందర్శించారు. గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రజలతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో లభించే సేవలను వివరించారు. గర్భవతులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ ప్రీస్కూల్ లో నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించారు. పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపైనా అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ఎవరు భిక్షాటనకు వెళ్లరాదని సీడీపీఓ ఉమా శంకరమ్మ తెలియజేసారు.

## గంగమ్మ చెంతకు గణనాథులు

**పామిడి -సూర్య వాస్తవం 'ఆగస్టు 29:** పామిడి పట్టణంలో గత మూడురోజుల క్రితం కొలువైన గణనాథులను పలుచోట్ల నెలకొల్పిన వినాయక విగ్రహాలను,కాలనీ వాసులు అందరూ కలిసి వినాయకుడిని మండపాలలో పూజలు చేసి కాలనీలో ఉన్నటువంటి మహిళలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొనడం జరిగింది. ఆ తర్వాత స్వామి వారి ఊరేగింపు వీధుల్లో కోలాహలాల నడుమ నృత్యాల తో రంగులు చల్లుకుంటూ బీసీసీ రోడ్ మెయిన్ బజార్ రహదారి గుండా పాటలు పాడుతూ, ప్రధాన రహదారి గుండా ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాలు చేశారు. యువత, అమ్మాయిలు కేరింతలు కొడుతూ నిమజ్జనంలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోంటూ ఆనందంతో నృత్యాలు చేశారు. తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పామిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.



## ప్రత్యేక ఆకర్షణలో ప్రకృతి వనం వినాయకుడు



**అనంతపురం - సూర్య వాస్తవం, ఆగస్టు 29:** అనంతపురం నగరం లోని స్థానిక వేణుగోపాల్ నగర్ విద్యానికేతన్ స్కూల్ దగ్గర 18వ వినాయక వార్షికోత్సవం సందర్భంగా కొలువుదీరిన ప్రకృతి వనం వినాయకుడు వినాయకుడిని దర్శించు కునేం దుకు నగరవాసులు, పిల్లలు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. కాలనీ వాసులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్ర సాదాలు అన్నదానం పంపిణి చేశారు. గణపతి నవరాత్రుల సమయంలో చిన్న పిల్లలు ఎంతో ఉత్సాహంగా, సరదాగా డాన్స్‌లు చేస్తూ గణపతిని కొలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి కమిటీ సభ్యులు మహేష్, సురేష్, వెంకటేష్, భాస్కర్, సాయి కుమార్, హరి పాల్గొన్నారు.

### కుర్నూతల సర్పంచ్ రమణపై

## హత్యాయత్నానికి పన్నాగం

- తనపై హత్యాయత్నం జరుగుతుందనే విషయాన్ని పసిగట్టి లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- తనకు రక్షణ కల్పించాలని సీఐ కొండారెడ్డికి వినతి



**లక్కిరెడ్డిపల్లె -సూర్య వాస్తవం,ఆగస్టు 29 :** ఇతని పేరు గాదిముతుక రమణయ్య. ఇతను లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతల గ్రామ సర్పంచ్‌గా కొన సాగుతున్నాడు. రాయచోటి నియోజకవర్గం, అన్నమయ్య జిల్లా. గతంలో ఇతను భార్య గాదిముతుక లక్ష్మీదేవి ఐదేళ్లు సర్పంచిగా కొన సాగారు. ఇతనికి గ్రామంలో మంచి పేరు ఉన్నది. ఇతను రెండోసారి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే గ్రామానికి చెందిన టిడిపి నేత నాగేశ్వర అనే అతను సర్పంచ్ రమణయ్యను హతమార్చాలని గత 15 రోజులుగా పన్నాగం పన్నుతున్నట్లు సమాచారం గ్రామస్తుల ద్వారా తెలిసిందని రమణయ్య వాపోయారు. నాగేశ్వర అనే టిడిపి నేత తన వద్ద పిడిబాకును పెట్టుకుని గ్రామంలోని కొంతమంది వ్యక్తుల దగ్గర సర్పంచ్ రమణయ్య ను చంపేస్తానని అన్నట్లు రెండు రోజుల క్రితం తెలిపారని, వారు సర్పంచ్ వద్దకు వెళ్లి నాగేశ్వర అనే అతను నిన్ను చంపేస్తానని బాకు పెట్టుకుని తిరుగుతున్నాడు నువ్వు జాగ్రత్తగా ఉండు అని చెప్పినట్లు రమణయ్య తెలిపారు.ఈ విషయం తెలిసిన సర్పంచ్ రమణయ్య శుక్రవారం సాయంకాలం లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ కు వెళ్లి నాగేశ్వర అనే టిడిపి నేత తనను చంపేస్తానని బెదిరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారని ఎస్సై రవీంద్ర బాబుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై రవీంద్రబాబు నాగేశ్వర తో పాటు మరో వ్యక్తిని పిలిపించి రెండు గంటల పాటు లక్కిరెడ్డిపల్లె స్టేషన్లో కూర్చోబెట్టారని సర్పంచ్ రమణ తెలిపారు.వారిపై కేసు పెట్టకుండా ఇంటికి పంపించేశారని తనకు తన కుటుంబానికి నాగేశ్వర అనే టిడిపి నేత ద్వారా ప్రాణహాని ఉందని తనకు లక్కిరెడ్డిపల్లె పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నానని తెలిపారు.ఈ విషయమై లక్కిరెడ్డిపల్లె సిఐ కొండారెడ్డికి ఫోన్ ద్వారా వివరణ కోరగా సర్పంచ్ రమణ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఇందులో ఎవరి పాత్ర ఉన్నా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ కు తావు లేదని,విచారణలో నిజ నిర్ధారణ తేలితే ఎవరిని వదలమని అన్నారు. నాగేశ్వర అనే అతన్ని కూడా పిలిపించి విచారణ చేపట్టామని అలాంటిదేమీ లేదని అన్నారని అన్నారు.

## శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా తెలుగు భాష దినోత్సవం







**పామిడి -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** పామిడి పట్టణంలో స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు,హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యానంద్ చిత్రపటాలకు పాఠశాల సీఈవో, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, రమణారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ గ్రాంథిక భాషగా వున్న తెలుగును సరళం చేసి, వ్యవహారిక తెలుగు భాషలో రమ్యతను తెలుగు జాతికి తెలియపరిచిన "అక్షర చిచ్చర పిడుగు గిడుగు పంతులు" గారిని స్మరిస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 29 తెలుగు భాష దినోత్సవంగా జరుపుకుంటామని విద్యార్థులకు తెలియజేశారు. డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ మన మాతృభాష తెలుగు, తెలుగు భాష మాధుర్యం,గొప్పదనం గురించి అనునిత్యం స్ఫురణ కలిగి, ప్రపంచ భాషా స్రవంతి లో మన తెలుగు భాష జీవనదిలా గల గలలతో కళ కళలతో అన్ని భాషల్లో అగ్రగామిగా నిలిచేలా చేయాల్సిన బాధ్యత మనందరిది అని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ప్రతి విద్యార్థి కూడా ధ్యాన్ చంద్ ని స్ఫూర్తిగా తీసుకొని చదువుతోపాటు క్రీడల్లోగాని రాణించాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండ ధ్యానం, వ్యాయామం చేయాలనీ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించినటువంటి నృత్యాలు నాటకాలు, కవితలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు ప్రఖ్యాత హాకీ ప్లేయర్ మేజర్ ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఐఏఎస్, కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గౌస్ బాషా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన ప్రసంగంలో ఆమె మాట్లాడుతూమేజర్ ద్యాన్ చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచి, శారీరకంగా,మానసికంగా అభివృద్ధి చెందాలి అని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లును అన్నమయ్య జిల్లా క్రీడాభివృద్ధి శాఖ తరఫున సబ్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, మేజర్ ద్యాన్ చంద్ గొప్ప హాకీ క్రీడాకారుడే కాకుండా గొప్ప దేశభక్తుడు అని ఆయన నాయకత్వంలో భారత్ వరుసగా మూడు సార్లు ఒలింపిక్స్ పోటీల్లో ప్రపంచ హాకీ విజేతగా నిలిచింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. గౌస్ బాష, ప్రిన్సిపాల్ డా. వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు, అధ్యాపకులు , విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుప్పానికి కృష్ణమ్మ జలకళ.. తీరిన రైతన్న దశాబ్దాల కల

- ఫలించిన చంద్రబాబు కృషి 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరిన కృష్ణమ్మ
- 19 నియోజకవర్గాలను తాకుతూ కృష్ణా జలాల పయనం
- 10 రిజర్వాయర్లను నింపుతూ శ్రీశైలం నుంచి నదీ జలాలు
- రాయలసీమను కోనసీమగా చేసేలా రికార్డు టైంలో హంద్రీ-నీవా విస్తరణ పనులు
- నేడు కుప్పం నియోజకవర్గంలో కృష్ణమ్మకు జల హారతి ఇవ్వనున్న సిఎం చంద్రబాబు

**కుప్పం -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు నాడు ఎన్టీఆర్ వివిధ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆయన కలను చంద్రబాబు నేడు సాకారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ సహకారంతో సీమ పల్లెల్లోకి నీళ్లు పారించారు. సీమకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అనేవి ఇన్నేళ్లూ కల.. కానీ ఇప్పుడు అది నిజం. ఈ కలను చంద్రబాబు నిజం చేశారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనేది మొదటి నుంచి తెలుగు దేశం పార్టీ సంకల్పం. సీమలో ప్రాజెక్టులు మొదలుపెట్టింది ఎన్టీఆర్ అయితే...వాటిని ముందుకు తీసుకువెళ్లి ఆ కలను నిజం చేసింది చంద్రబాబు నాయుడు. అతి తక్కువ వర్ష పాతం ఉండే సీమ జిల్లాల్లో నీళ్లతోనే సీమ ప్రజల స్థితిగతులు మారుతాయని ఇరిగేషన్ కు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో హంద్రీ నీవాకు ఉమ్మడి రాష్ట్రంలో 1999 జులై 9 చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ రోజు బీడు భూముల్లో నీళ్లు పారేలా చేశారు. ఇదంతా రాత్రికి రాత్రి ఇది జరగలేదు. 2014 నుంచి నేటి వరకు ప్రభుత్వం భారీ ఎత్తున సాగునీటి ప్రాజెక్టులపై నిధుల ఖర్చు చేయడం వల్ల నేడు హంద్రీనీవా నీళు చిత్తూరు జిల్లాలో చివరి ఆయకట్టు భూములకు చేరాయి.

**- హెచ్ఎన్ఎస్ఎస్ కు నాడు అత్యంత ప్రాధాన్యం**

హంద్రీనీవా ప్రాజెక్టుపై 2014-19 మధ్య రూ.4,183 కోట్లు ఖర్చు పెట్టి చంద్రబాబు ప్రాజెక్టును పరుగులు పెట్టించారు. 2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సీజన్‌లో ఎలాగైనా నీళ్లు ఇవ్వాలని లక్ష్యంతో పనుల్లో వేగం పెంచారు. రికార్డు స్థాయిలో కేవలం 100 రోజుల్లో మెయిన్ కెనాల్ విస్తరణ, లైనింగ్ పనులు పూర్తి చేసి ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచారు.



**-సాగు బాగుంటేనే... రాష్ట్రం బాగుంటుంది**

సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ చెబుతారు. చెప్పడమే కాదు దాన్ని చేసి చూపించాలన్న సంకల్పంతోనే రికార్డు స్థాయిలో చేపట్టిన హంద్రీ-నీవా కాల్వ విస్తరణ పనులతో సీమకు జలకళ వచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతోంది. విస్తరించిన కాల్వల ద్వారా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ 19 నియోజకవర్గాలను తాకింది. 10 రిజర్వాయర్‌లను నింపుతోంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ, అనంతపురం జిల్లాలో జీడిపల్లి, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు నిండాయి. సత్యసాయి జిల్లాలో మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసాపురం, అడవిపల్లి రిజర్వాయర్లు నిండుతున్నాయి. అలాగే గాజుల దిన్నెకు నీరు చేరింది.

**- చిత్తూరు సస్యశ్యామలం**

హంద్రీనీవా ఆయకట్టులో చిట్ట చివరి జిల్లా చిత్తూరు. చిత్తూరు జిల్లాలో 16 లక్షల ఎకరాల సాగుభూమి ఉన్నా కేవలం 6 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. మిగిలిన 10 లక్షల ఎకరాలకు సాగునీరిస్తే రైతన్నకు నీటి కొరతే ఉండదు. హంద్రీనీవా రెండో దశ పనులు పూర్తి చేసి జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు ప్రభుత్వం ఇవ్వనుంది. చిత్తూరు జిల్లాలో సాగు అంతా బోర్లపైనే ఆధారపడి ఉంది. 565 కి.మీ. మేర ఉన్న పుంగనూరు, నీవా, తంబళ్లపల్లి, కుప్పం, చింతపర్తి, ఎల్లుట్ల, వాయల్పాడు, సదుం బ్రాంచ్ కాలువలతో 1,86,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. పీలేరు, పుంగనూరు, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు నియోజకవర్గాల ప్రజలకు దీంతో ప్రయోజనం కలుగుతుంది.

**పరమ సముద్రానికి కృష్ణా జలాలు**

గత నెల 17వ తేదీన కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేశారు. నాటి నుంచి హంద్రీనీవా కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మ 738 కి.మీ ప్రయాణించి కుప్పానికి చేరింది. పరమ సముద్రంలో సిఎం చంద్రబాబు కృష్ణా జలాలకు హారతి ఇవ్వనున్నారు. తరలి వచ్చిన కృష్ణమ్మ కుప్పం నియోజకవర్గంలో ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. జల హారతి కార్యక్రమం కోసం కుప్పం వెళుతున్న సిఎం వారి సంతోషాన్ని పంచుకోనున్నారు.

**కుప్పం బ్రాంచ్ కెనాల్**

215 క్యూసెక్కుల సామర్థ్యంతో 123 కి.మీ. పొడవున కుప్పం బ్రాంచ్ కెనాల్ నిర్మించారు. రూ.197 కోట్లతో కాలువ లైనింగ్ పనులు పూర్తి చేశారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో ఈ కాలువ వెళ్తుంది. ఈ కాలువ ద్వారా 4 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వడమే కాకుండా...110 చెరువులు నింపడం ద్వారా 6,300 ఎకరాల స్థిరీకరణ జరుగుతుంది. ప్రభుత్వ చిత్తశుద్ధి సంకల్పంతో 40 టిఎంసిల నీటిని ఒక్క హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయల సీమ జిల్లాలు వినియోగించుకోనున్నాయి. చెరువుల అన్ని నింపే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. దీంతో సీమలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తులు పెంచేందుకు సాగునీటి సౌకర్యం ఎంతో దోహదం చేయనుంది. ఈ ప్రాంత రైతులు, ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరగనున్నాయి.



## ఆటో స్పేర్ పార్ట్స్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ - స్పేర్స్ పూర్తిగా దగ్ధం

- ప్రమాదంలో రూ.7 లక్షల ఆస్తి నష్టం
- లబోదిబో అంటూ కన్నీటి పరవశమై విలపిస్తున్న యజమానురాలు
- సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది
- తక్షణమే మంటలను అదుపులోకి తీసుకోవడంతో భారీ ప్రమాదం తప్పింది
- సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తున్న నాయుడుపేట సీఐ బాబి





**నాయుడుపేట- సూర్యా వాస్తవం ,ఆగస్టు 29:**నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాయపుముని కృష్ణమ్మకు చెందిన ఆటో స్పేర్ పార్ట్స్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు అదుపు తప్పి షాప్ మొత్తాన్ని చుట్టుముట్టాయి.వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, ఫైరింజన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే షాప్‌లోని ఆటో స్పేర్ పార్ట్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో పక్కన ఉన్న మరో షాప్ కూడా మంటలకు పాక్షికంగా ఆహుతి అయింది.ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. దుకాణాలకు ఎలాంటి ఇన్సూరెన్స్ లేకపోవడంతో యజమానులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## కుప్పంకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు








**కుప్పం -సూర్య వాస్తవం, ఆగస్టు 29:**

కృష్ణాజలాలను కుప్పం ప్రజలకు అంకితం చేయడానికి జల హారతి కార్యక్రమంలో పాల్గొన్ననున్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం కుప్పంకు చేరు కున్నారు. బెంగళూరు నుంచి శాంతిపురం మండలం తుమ్మిసి హెలిపాడ్ కు చేరుకుని అక్కడి నుంచి కడపల్లి వద్ద ఉన్న తన స్వగృహానికి చేరు కున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావ్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి పులివర్తి నాని, మంత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీ ఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా అధికారులు, ఘన స్వాగతం పలికారు.

**ముఖ్యమంత్రి పర్యటన సాగనుందిలా ..**

హంద్రీనీవా కాలువ ద్వారా శ్రీశైలం నుంచి 730 కిలోమీటర్లు ప్రయాణించి కుప్పంకు చేరుకున్న కృష్ణ జలాలకు జలహారతి ఇవ్వడానికి శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం చేరుకున్నారు. ఆయన రాత్రికి కడపల్లి వద్ద నిర్మించిన తన స్వగృహంలో బస చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కడ సలహా కమిటీ సభ్యులు, అధికారులతో గంటపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో



పరిశ్రమల ఏర్పాటు అంశాలపై చర్చించారు. కుప్పం ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రాంగణాన్ని ఆధునికరించి అందులో అంతర్గత రింగ్ రోడ్డు నిర్మించే విషయంపై సదరు అధికారులతో చర్చించారు. అనంతరం కుప్పం పట్టణాన్ని కలుపుతూ ఏర్పాటు చేయనున్న కొత్తపేట మార్గం పై అధికారులు తో ఆయన చర్చించి పలు సూచనలు చేశారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న సము దాయాల విషయమై ఆయన అధికారులతో చర్చించారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో చేయవలసిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై నేతలు అధికారులు ముఖ్యమంత్రికి విన్న వించారు. శనివారం ఉదయం 11 గంటలకు ముఖ్య మంత్రి కుప్పం పట్టణానికి చేరుకొని ఆర్టీసీ ఉచిత బస్సు పథకం ద్వారా లబ్ధి పొం దనున్న లబ్ధిదారులతో మాట్లాడ నున్నారు. అనంతరం కుప్పం మండలంలోని పరమ సముద్రం చెరువు వద్దకు చేరు కోనున్నారు. అక్కడ జలహారతి కార్యక్రమం నిర్వహించిన తర్వాత హంద్రీ నీవా సృజల స్రవంతి పైలాన్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం మహిళా శక్తి భవన్ పారిశ్రామిక భవనానికి శంకుస్థాపన చేయనున్నారు.

అనంతరం పరమ సముద్రం చెరువు వద్ద ప్రజలతో మనమేకమై అక్కడ ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ప్రసంగిం చనున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత సుమారు రెండు గంటలపాటు పారి శ్రామిక వేత్తలతో సమావేశమవుతారు. కుప్పం నియోజ కవర్గంలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలపై సంబంధిత అది ,కారులతో ఎన్నో చేసుకోనున్నారు. అనంతరం పరమ సముద్రం చెరువు వద్దకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన హెలిపేట ద్వారా హైదరాబాదుకు తిరుగు ప్రయాణం కానున్నారు.

# పవర్ వాడేసుకుంటున్న మోషే రాజు...


**విజయవాడ-సూర్య వాస్తవం:** ఏపీలో కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. దూకుడు నిర్ణయాలు తీసు కుంటుంది. రాజకీయంగా కూడా అత్యంత బలంగా ఉంది. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. కూటమి అంటేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు భయపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక నేత మాత్రం టిడిపి కూటమికి లెక్కచేయడం లేదు. డోంట్ కేర్ అంటూ తేల్చి చెబుతున్నారు. కూటమికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం లేదు సరి కదా.. ఏకంగా ప్రభుత్వాన్ని ఢీకొట్టేలా వ్యవహరిస్తున్నారు. పోనీ పవర్ ఫుల్ నాయకుడు అనుకుంటే అది కాదు. వైసిపి పట్ల అంత అభిమానం ఎందుకంటే.. జగన్ పిలిచి మరి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంతకీ ఎవరా నేత? అంటే.. మండలి చైర్మన్ కొయ్య మోసేన్ రాజు.తాజాగా శాసనమండలి కార్యదర్శి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎమ్మెల్సీ పదవి పొందిన జయ మంగళం వెంకటరమణ కొద్ది నెలల కిందట జనసేనలో చేరారు. వైసిపి ద్వారా తనకు వచ్చిన ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేశారు. అయితే ఆ రాజీనామాను మండలి చైర్మన్ మోసేన్ రాజు ఆమోదించడం లేదు. నెలల తరబడి పెండింగ్లో పెట్టారు. దీంతో జయ మంగళం వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం శాసనమండలి కార్యదర్శికి నోటీసులు ఇచ్చింది. దీంతో మండలి చైర్మన్ మోసేన్ రాజు వ్యవహార శైలి మరోసారి చర్చకు వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. ఆ పార్టీకి చెందిన కీలక నేతలు సైతం బయటకు వెళ్ళిపోయారు. ప్రస్తుతం మద్యం కుంభకోణంలో జగన్ పేరు సైతం వినిపిస్తోంది. ఇటువంటి సమయంలో కూడా మండల చైర్మన్ మోసేన్ రాజు కఠినంగా వ్యవహరిస్తుండడం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండడం మాత్రం చర్చకు దారితీస్తోంది. మండలి చైర్మన్ మోసేన్ రాజు గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు మోసేన్ రాజు. 1987లో భీమవరం పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ గా గెలిచారు. వరుసగా నాలుగుసార్లు కౌన్సిలర్ అయ్యారు. 2009లో కొవ్వూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పట్లో పశ్చిమగోదావరి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కానీ జగన్ పిలుపుమేరకు 2010లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉండి శాసనసభ నియోజకవర్గ ఇన్చార్జిగా కూడా వ్యవహరించారు. 2021 జూన్ 14న ఆయన గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అదే ఏడాది నవంబర్లో మండలి చైర్మన్గా మోసేన్ రాజును నియమించారు జగన్మోహన్ రెడ్డి. ఏకంగా క్యాబినెట్ హోదా కల్పించారు. ఆ కృతజ్ఞతతోనే ఎన్ని రకాల ఒత్తిళ్లు ఎదురైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీల రాజీనామాను ఆమోదించడం లేదు. ఆమోదించిన మరుక్షణం ఓ ఆరు ఎమ్మెల్సీ స్థానాలు టిడిపి కూటమి ఖాతాలో పడతాయి.ప్రస్తుతం మండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగుతోంది. గత ఎన్నికల ఫలితాలు వచ్చిన సమయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం 38 మంది ఎమ్మెల్సీలు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పోతుల సునీత, కర్రీ పద్మశ్రీ, బల్లి కళ్యాణ చక్రవర్తి, మర్రి రాజశేఖర్, జాఖియా ఖానం, జయ మంగళం వెంకటరమణ వంటి వారు రాజీనామా చేశారు. కేవలం కూటమి ఖాతాల్లో ఎమ్మెల్సీ పదవులు పడేందుకే వీరంతా రాజీనామా బాట పట్టారు. అయితే దీనిని గ్రహించిన మండలి చైర్మన్ మోసేన్ రాజు వారి రాజీనామాలను ఆమోదించడం లేదు. అందుకే ఇప్పుడు జయ మంగళం వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు.



కోర్టు శాసనమండలి కార్యదర్శికి నోటీసులు జారీచేసింది. దీనికైనా మూసేన్ రాజు స్పందిస్తారో? లేదో? చూడాలి.

# వరద నీటితో ఉరకలేస్తున్న గోదావరి

**ఏలూరు-సూర్య వాస్తవం:** అఖండ గౌతమి గోదావరి వరద నీటితో ఉరకలేస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉపనదుల వరద నీరు గోదావరిలో చేరడంతో వరద నీటిమట్టం గంట గంటకూ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం గురువారం సాయంత్రం 38.60 అడుగులుగా నమోదైంది. అక్కడ నీటి ప్రవాహం 7,45,596 క్యూసెక్కులు ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నీటిమట్టం మరింతగా పెరిగి మొదటి ప్రమాద హెచ్చరికను దాటే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 38 అడుగులు దాటడంతో ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పలు గ్రామాలు తిరిగి జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై వరద బాధిత గ్రామాలకు నిత్యావసరాలు పంపే చర్యలు చేపట్టింది. గోదావరి వరద పోలవరం ప్రాజక్టుకు చేరడంతో స్పిల్వే వద్ద ఎగువన 31.420 మీటర్లు, దిగువన 22.410 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఎగువ కాఫర్డాం వద్ద 31.950 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం వద్ద 22.00 మీటర్ల నీరు ఉంది. దీంతో స్పిల్వే గేట్లు తెరిచి 7,41,269 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి వరదతో కుకునూరు, వేలేరుపాడు మండలాలకే ప్రధానంగా ముప్పు పొంచి ఉంది. అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి ఆదేశించారు. వరద పెరుగుతున్న దృష్ట్యా ప్రజలెవరూ నదిలోకి



వెళ్లవద్దని, చేపలు పట్టడం ఈతకు వెళ్ళడం చేయవద్దని ఆమె ప్రజలకు సూచించారు. ఇప్పటికే అధికారులు ఆయా వరద బాధిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉన్నారని ఆమె తెలిపారు.

ఇదిలా వుండగా ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్కు వరద నీరు భద్రాద్రి - కొత్తగూడెం జిల్లానుండి వచ్చి చేరుతోంది. తమ్మిలేరు ప్రాజక్టులో వరద నీటిమట్టం 341.38 అడుగులుగా నమోదయింది. ప్రాజక్టులోకి 648 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 58 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజక్టుకు సమాంతరంగా ఉన్న గోనెలవాగులో నీటి మట్టం 341.06 అడుగులుగా నమోదైంది. తమ్మిలేరు రిజర్వాయర్లోకి 353 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతున్నప్పటికీ, సత్తుపల్లి తాలూకాలోని బేతుపల్లి అలుగు భారీ వర్షాలకు నిండి వరద పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

## నిమజ్జనం పూర్తి చేయుటకు
# రహదారి మరమ్మతులు



**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 29 :**
గుత్తి అర్బన్ వినాయక చతుర్థి పండగ సంబరాలులో భాగంగా రోజు అనగా 29.08. 2025 నాడు వినాయకుని విగ్రహాలు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహణను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలు జరుగుటకు మున్సిపల్ కమీషన్ బి.జ బ్బార్ మియా ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు డి. ఈ.ఈ హేమచంద్ర కుమార్ శానిటరీ ఇన్స్ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాషా, ఏ.ఈ గోవిందప్ప పర్యవేక్షణలో విగ్రహాలను నిమజ్జనం చేయు తురకపల్లి చెరువు, సూర సింగన పల్లి చెరువులయందు ఏర్పాట్లను తనిఖీ చేసి కార్యక్రమమును ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహనాలు స జావుగా వెళ్లి నిమజ్జనం పూర్తి చేయుటకుగాను రహదారి పనులను జేసిబి ద్వారా మట్టి వేయించి దారులు సుగుమమ చేయించడం జరిగినదని మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా తెలియజేశారు.

# ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపిక

**గుత్తి -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** గుత్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత దాండియా మహమ్మద్ షఫీ ని ఇంటర్నే షనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నేషనల్ ప్రెసిడెంట్ హాజీ మహమ్మద్ ముజాహిద్, నే షనల్ చైర్మన్ షోయబ్ ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ షఫీ మాట్లాడుతూ నా



మీద న మ్మకంతో నాకు రాష్ట్ర ము ఖ్యమైన ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చినందుకు ఎల్ల ప్పుడూ రాష్ట్ర ప్రజలకు అం దుబాటులో ఉండి నా దృష్టి కి ఏదైనా సమస్య తీసుకుని వస్తే ఆ సమస్యను కచ్చితంగా పరిష్కరించే విధంగా నా వంతు సహాయ సహకారా లు అందిస్తానని త్వరలో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కూడా కమిటీలు ఏర్పాటు చేస్తానని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

### నిరంకుశ పాలనతో ప్రజాస్వామ్యాన్ని
# ఖూనీ చేస్తున్న కూటమి ప్రభుత్వం
### -మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** నిరంకుశ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నెల్లూరు నగరంలోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణా రెడ్డి చేస్తున్న అక్రమాలను బయటపెట్టెందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై హత్యాయత్నం కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలియజేసేందుకు కావలి పర్యటనకు వెళ్తున్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి,ఎమ్మెల్సీ, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి లను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే ఖండించారు. అనంతరం మాజీ మంత్రి కాకాణి తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

### అపశృతులు దొర్లకుండా
# గణేష్ నిమజ్జనం చేపట్టండి
### -జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 29:** అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా...అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తీ చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. శుక్రవారం ఆయన రాచానపల్లి మరియు పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాలను జిల్లా ఎస్పీ గారు సందర్శించారు. గణేష్ ప్రతిమలను కాలువ నీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించారు. ఎలాంటి ఘటనలకు జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా... నిమజ్జనం ప్రాంతాలలో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ వెంట అనంతపురం రూరల్ సి.ఐ శేఖర్ , పీఎస్సై సాయి, తదితరులు వెళ్లారు.

# గ్రామాల్లో "ఫ్రైడే - డ్రై డే"
### - లార్వా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి



**పెళ్లకూరు-సూర్యా వాస్తవం, ఆగస్టు 29:** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమం శుక్రవారం దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏకొల్లు, నెల్లూరుపల్లి, ఉచ్చూరు తదితర పంచాయతీలలో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో ముందుగా నిల్వ నీరు ఉన్న ప్రదేశాలను గుర్తించి క్లోరినేషన్ చేశారు. నిల్వ నీటిలో ఉండే లార్వా, దోమ కీటకాలను మందుల ద్వారా నిర్మూలించారు. అనంతరం గ్రామ వీధులలో, మురికికాలువల వద్ద, త్రాగునీటి బోర్ల వద్ద, కొళాయిల చుట్టూ మందులు పిచికారీ చేసి లార్వా నశింపజేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రత పాటించాలని, జలధార గుంటలు, నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండకూడదని వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణపై సూచనలు ఇచ్చి, జ్వరాల సర్వే కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సూళ్లూరుపేట మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్ నెల్లూరుపల్లి పంచాయతీలో పరిశీలించారు. గ్రామస్తులకు మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాల నివారణ చర్యలపై అవగాహన కలిగించారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయకుని నిమజ్జనం

**గుత్తి -సూర్యవాస్తవం, ఆగస్టు 29 :** గుత్తి అర్బన్‌లో వినాయక చతుర్థి పండగ సంబరాలులో భాగంగా రోజు అనగా 29.08.2025 నాడు వినాయకుని విగ్రహాలుని మజ్జన కార్యక్రమాలు నిర్వహణను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జ న కార్యక్రమాలు వీధుల గుండా డాన్సులతో తప్పట్లతోనే మేళాల తో



బాణాసంచాలు కాలుస్తూ వెళ్లి తురకపల్లి కుంట సూరి సింగనపల్లి పల్లి చెరువులు కుంటల్లో నిమజ్జనం చేయడం జరిగింది.



# అప్పుడు బ్రహ్మోత్సవం.. ఇప్పుడు SSMB29

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు - దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న SSMB29సినిమాపై దేశవ్యాప్తంగా అభిమానుల్లో భారీ క్రేజ్ ఉంది. ఫారెస్ట్ అడ్వెంచర్ నేపథ్యంలో ప్రపంచ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ సినిమా, 1000 కోట్ల భారీ బడ్జెట్ తో సిద్ధమవుతోంది. భారీ బడ్జెట్, స్పెషల్ సెట్‌లతో ఈ సినిమా రికార్డులు సృష్టించాలన్నది మేకర్స్ టార్గెట్. కానీ ఈ మధ్య జరిగిన ఒక ఘటన టీమ్‌కు ఊహించని షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది.లేటెస్ట్ టాక్ ప్రకారం, హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో రూ.2 కోట్ల ఖర్చుతో ప్రత్యేకంగా వేసిన ఒక సరస్సు సెట్, ఒక్కసారిగా వృథా అయిపోయిందతా. ఎందుకంటే, షూటింగ్‌కి ప్లాన్ చేసిన రోజే, మహేష్ బాబు లొకేషన్‌కు రాగానే తీవ్ర వేడి కారణంగా ఆయన అక్కడ ఎక్కువసేపు ఉండలేకపోయారట. “ఇది నా తప్పు కాదు, సారీ” అంటూ మహేష్ వెళ్లిపోవడంతో, దానికి సంబంధించిన షూట్ ఆగిపోయిందని తెలుస్తోంది. దీంతో ఆ భారీ సెట్టప్ ను వాడకుండానే ప్యాక్ చేయాల్సి వచ్చిందని సమాచారం.


**అప్పట్లో కూడా ఇలానే..**

ఇలాంటి పరిణామాలు మహేష్ బాబు కెరీర్‌లో ఇదే తొలిసారి కాదు. గతంలో బ్రహ్మోత్సవం షూటింగ్ సమయంలో కూడా, డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక పాటను అవుట్‌డోర్‌లో ప్లాన్ చేశారని, కానీ మహేష్ బాబు ఎండ భరించలేకపోయినట్టు, దాన్ని ఇండోర్‌లోకి మార్చారని అప్పట్లో ఇండస్ట్రీలో టాక్ వినిపించింది. ఇప్పుడు SSMB29లో ఇలాంటి సంఘటన మరోసారి వార్తల్లోకి వచ్చింది.

**గ్రాండియర్ ప్లస్ బడ్జెట్‌ఫ** ఈ ఘటనతో మేకర్స్ కు పెద్ద షాక్ ఇచ్చినా, మహేష్ అభిమానులు మాత్రం హీరో కంఫర్ట్ ముఖ్యమనే తరహాలో కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం రూ.2 కోట్ల సెట్ ఒక్కసారిగా వృథా అవ్వడాన్ని విమర్శిస్తున్నారు. స్టార్ హీరోలకు ఇలాంటి ప్రాధాన్యం ఇవ్వడం వల్లే బడ్జెట్ మరింత పెరగడంతో పాటు, వృథా ఖర్చులు పెరుగుతున్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి.రాజమౌళి సినిమా గ్రాండియర్ ను, బడ్జెట్‌ను మేనేజ్ చేయడంలో ఎంతో కేర్ తీసుకుంటాడనే టాక్ ఉంది. కానీ SSMB29 లాంటి భారీ చిత్రాల్లో, స్టార్ హీరోను సెట్‌లో కంఫర్ట్‌గా ఉంచడమే పెద్ద టాస్క్. ఫారిన్ టెక్నీషియన్స్, గ్రాఫిక్స్ టీమ్, మాస్ ఆడియెన్స్‌కి కనువిందు చేసేలా విజువల్స్ ఇవ్వాలని మేకర్స్ చూస్తున్నారు. ఇక సినిమా విషయంలో భవిష్యత్తులో ఇంకా ఎలాంటి గాసిప్స్ వినిపిస్తాయో చూడాలి.

## జననాయకుడు వర్సెస్ రాజాసాబ్..

# అప్పటికి లెక్కలు మారడం పక్కా!



తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ జననాయగన్ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కు రెడీ అవుతుంది. 2026 జనవరి 9న గ్రాండ్ గా విడుదల కానుంది. అయితే రెబల్ స్టార్ ప్రభాస్ భారీ బడ్జెట్ సినిమా రాజాసాబ్ కూడా అదే రోజు రానుంది. ఈ మేరకు నిర్మాత టిజి విశ్వప్రసాద్ ప్రకటించారు. అయితే ఆయన అనౌన్స్ మెంట్ తో తమిళనాడు, కేరళ, కర్ణాటక బయ్యర్లు కంగారు పడుతున్నారు. ఒకే రోజు రెండు భారీ చిత్రాలు థియేటర్లకు రావడం బయ్యర్లకు ఇష్టం లేదు. జన నాయకుడు సినిమా తక్కువ అంచనా వేస్తున్నారా? అంటూ దళపతి అభిమానులు సోషల్ మీడియాలో ప్రభాస్ ఫ్యాన్స్ ను రెచ్చగొడుతున్నారు. అయితే రిలీజ్ డేట్ దగ్గరయ్యే కొద్దీ ఇలాంటివి ఎక్కువ అవ్వడం పక్కా! కానీ, ఇక్కడ ఒక్కో ఏరియాలో ఒక్కో హీరో స్టామినా ఒక్కోలా ఉంది. విజయ్ సినిమా కోసం తమిళనాడు ఎగ్జిబిటర్లు ఫుల్ సపోర్ట్ ఉంటారు. ప్రేక్షకులను ఎక్కువగా థియేటర్లలకు రప్పించేలా చూస్తారు. అయితే రాజకీయంగా రూలింగ్ పార్టీతో విజయ్ కయ్యానిలి కాలు దువ్వారు. ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధితో సంబంధాలు సరిగ్గా లేవు. తమిళనాడులో ఏ సినిమాకైనా రెడ్ జయంట్ కంపెనీ వాళ్లే డిస్ట్రిబ్యూషన్ లో ఆధిపత్యం చెలాయిస్తోంది. వాళ్ల సపోర్ట్ లేకుండా ఎక్కువ స్క్రీన్లు తెచ్చుకోవడం కష్టం. అందుకే ఇది రాజా సాబ్ కు బెనిఫిట్ అవుతుందని విశ్లేషకుల అంచనా. అయితే ఇలాంటివి ఎన్ని కలిసొచ్చినా.. విజయ్ ముందు నిలబడడం కష్టమే. ఆయన సినిమాకు ఇప్పుడు హైప్ ఎక్కువగా లేకుండా..రిలీజ్ నాటికి లెక్కలు మారిపోతాయి. పైగా ఈ సినిమా భగవంత్ కేసరి రీమేక్ అని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిని మూవీటీమ్ ఖండిస్తూ వస్తోంది. కానీ రిలీజ్ అయ్యే దాకా దీనిపై క్లారిటీ రాదు. రాజా సాబ్ కు ఏపీ, తెలంగాణ, ఓవర్సీస్ తో పాటు ఇతర ఏరియాల్లో భారీ ఓపెనింగ్స్ తెచ్చుకోవాలంటే.. మార్కెటింగ్ అత్యంత అవసరం. దసరా పండగకు ట్రైలర్ రానుంది. ప్రస్తుతం మేకర్స్ అదే పనిలో బిజీగా ఉన్నారు.



# తెలుగు టైటాన్స్‌కు నిరాశ



## -తమిళ్ తలైవాస్ చేతిలో పోరాడినా ఓటమే
## - ప్రొ కబడ్డీ సీజన్-12

**విశాఖపట్నం:** ప్రొ కబడ్డీ సీజన్-12 ప్రారంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌కు నిరాశ తప్పలేదు. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35-38పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో పోరాడి ఓటమిపాలైంది. రెండో అర్ధభాగంలో ఒక దశలో 6పాయింట్ల ఆధిక్యతలో నిలిచినా.. ఆ తర్వాత క్రమంలో పాయింట్లను చేజార్చుకుంది.తొలి అర్ధభాగం ముగిసేసరికి తెలుగు టైటాన్స్ 13-14పాయింట్లతో వెనుకబడింది. రెండో అర్ధభాగంలో తలైవాస్ కెప్టెన్ సెహ్రావత్ చెలరేగి ఆడాడు. చివరి రైడ్‌కు వెళ్లి ఏకంగా 3 సూపర్ రైడ్ పాయింట్లు సాధించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఇక బెంగళూరు బుల్స్-పుణేరి పల్టన్స్ మధ్య జరిగిన మరో మ్యాచ్ 32-32పాయింట్లతో డ్రా అయ్యింది. కానీ టై బ్రేకర్‌లో పుణేరి 6-4పాయింట్ల తో జయభేరి మోగించింది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి మ్యాట్‌పై ఆరుగురు ఆటగాళ్లుఉన్నా.. ఎదుటి జట్టు రైడర్ బోనస్‌పాయింట్ లైన్‌ను టచ్‌చేస్తే ఒక పాయింట్ లభిస్తుంది. అలాగే నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు పాయింట్ల పరంగా సమంగా ఉంటే గతంలో టైగా ప్రకటించి సమాన పాయింట్లు కేటాయించేవారు. కానీ ఈసారి గేమ్ టై అయితే.. ప్రతిజట్టుకు ఐదేసి చొప్పున రైడ్‌లు ఇవ్వడం జరుగుతుంది. ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు.

**ప్రొ కబడ్డీలో నేడు**

తెలుగు టైటాన్స్ ఐ యుపి యోధాస్ (రా.8.00గం.ఎలకు)

యు ముంబ ఐ గుజరాత్ జెయింట్స్ (రా.9.00గం.ఎలకు)



# హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్

## - చైనాపై భారత్ జయభేరి
## - 31న జపాన్‌తో ఢ
## - ఆసియాకప్ హాకీ టోర్నీ

**రాజ్‌గిరి (బీహార్):** ఆసియాకప్ హాకీలో భారతజట్టు జయభేరి మోగించింది. శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-3గోల్స్ తేడాతో పటిష్ట చైనాపై విజయం సాధించింది. భారతజట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో రాణించాడు. మరో గోల్‌ను జుగ్‌రాజ్ చేశాడు. రాజ్‌గిరి వేదికగా ప్రారంభమైన ఈ టోర్నీలో గ్రూప్-ఎలో ఉన్న భారతజట్టు తొలుత ఒక గోల్ కొట్టి 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత వరుసగా మరో రెండు గోల్స్ కొట్టి 3-0 ఆధిక్యతలో నిలిచినా.. చైనా మూడో క్వార్టర్ ముగిసేసరికి 3-3గోల్స్‌తో సమం చేసి అద్భుతంగా పుంజుకుంది. నాల్గో క్వార్టర్‌లో బంతి ఎక్కువభాగం భారత్ పక్షానే ఉండగా.. హర్మన్‌ప్రీత్ చివర్లో గోల్ కొట్టి భారత్‌ను 4-3 ఆధిక్యతలో నిలిపాడు. ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌కు నేరుగా బెర్త్ దక్కించుకోవాలంటే ఈ టైటిల్‌ను చేజిక్కించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలోనే నాల్గో టైటిల్‌పై భారత్ కన్నేసింది. నాల్గో క్వార్టర్‌లో భారత్‌కు పెనాల్టీ కార్నర్‌లు ఎక్కువగా లభించాయి. ఆదివారం జరిగే రెండో గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు జపాన్‌తో తలపడనుంది. ఇక గ్రూప్-బిలో మలేషియా జట్టు 4-1గోల్స్ తేడాతో బంగ్లాదేశ్‌ను, దక్షిణ కొరియా 7-0గోల్స్ తేడాతో చైనీస్ తైపీను ఓడించాయి.

## మహిళలను నమ్మించి మోసం చేసిన

# కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

- వైయస్ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి
- వైసీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజత



**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** మహిళలను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్రం లోని మహిళలు సిద్ధంగా ఉన్నారని వైయస్ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు,ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి,వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితలు స్పష్టం చేశారు. నెల్లూరులో కాకాణి పూజిత ఆధ్వర్యంలో వైయస్ఆర్‌సీపీ మహిళా విభాగం జోనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వరుదు కళ్యాణి, కాకాణి పూజితలు మీడియాతో మాట్లాడారు. కూటమి సర్కార్ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందని వారు మండిపడ్డారు. నిజమైన మహిళా సాధికారతను వైయస్ జగన్ ప్రభుత్వంలోనే చూశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. 16 నెలలుగా మద్యాన్ని ఏరులై పారిస్తూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని,మద్యానికి బానిసలుగా మారి,మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు నిత్యం జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా అనిపించడం లేదనాడు మహిళలకు రక్షణగా నిలబడిన దిశ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి ఎందుకు ఓటేశామా అని ప్రతి మహిళలోనూ పశ్చాత్తాపం కనిపిస్తోందన్నారు. ప్రతి మంగళవారం అప్పులు చేస్తున్నప్పటికీ ఒక్క పథకాన్ని అమలు చేసిన పాపానపోవడం లేదన్నారు. ఫ్రీ బస్,మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీలన్నీ బోగస్. తూతూమంత్రంగా అమలు చేసేసి అన్నీ ఇచ్చేశామని ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. లిక్కర్ ఆదాయం ఎలా పెంచుకోవాలన్న ఆలోచన తప్ప మహిళల భద్రత గురించి ఈ ప్రభుత్వానికి పట్టింపే లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి వాడకం పెరిగిపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకు అండగా నిలబడాలని వైయస్సార్సీపీ మహిళా విభాగం నిర్ణయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను,మహిళలకు జరుగుతున్న మోసాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గడిచిన ఐదేళ్ల వైయస్సార్సీపీ పాలనలో వైయస్ జగన్ మహిళలకు ఏవిధంగా అండగా నిలబడ్డారో ఇంటింటికీ వివరిస్తామని తెలిజేశారు.

రాష్ట్రంలో ఒక్క మహిళకైనా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కేవలం ఐదు రకాల బస్సుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తున్నారని,11 రకాల బస్సుల్లో మహిళలు టికెట్ చెల్లించాల్సిందేనన్నారు. ఆడ బిడ్డ నిధి పథకం ఊసే ఎత్తడం లేదన్నారు. ఏ ఒక్క యువతికి ఉద్యోగం ఇచ్చింది లేదన్నారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెప్పుకుంటూనే సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్,మంత్రి నారా లోకేష్‌లు మాత్రం స్పెషల్ ఫ్లైట్‌లు, హెలిక్యాప్టర్ లలో విహరిస్తున్నారన్నారని,ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ,నీటి అలల్లో తేలే రాజధానిని నిర్మిస్తూ కలల రాజధాని అని చెప్పుకు తిరుగుతున్నారని అన్నారు. వారానికి వారం అప్పులు తెస్తూ సంపద సృష్టిస్తున్నామని ఘోరంగా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఇది ఆడబిడ్డలను వేధిస్తున్న టీడీపీ కాలకేయుల ప్రభుత్వం అని ఏ మహిళని అడిగినా చెబుతుందన్నారు. సాక్షాత్తు జూనియర్ ఎన్టీఆర్ తల్లిని టీడీపీ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే చెప్పలేని భాషలో తిడితేనే అతడి మీద చర్యలు తీసుకోలేదన్నారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని వైయస్సార్సీపీ మహిళా నాయకుల మీద రాయలేని భాషలో మార్ఫింగ్ ఫొటోలతో ట్రోలింగ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీపీ సైకోల కారణంగా గతంలో గీతాంజలి అనే మహిళ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని తెలిపారు. రూ. 5 కోట్లు ఖర్చు చేసి తన తల్లిని టీడీపీ వారితో తిట్టించారని గతంలో పవన్ కళ్యాణ్ సైతం స్వయంగా చెప్పాడని,మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి నాయకులు దాడులు, అఘాయిత్యాలు చేస్తున్నారని అన్నారు. ముగ్గురు మహిళా మంత్రులుండి కూడా మహిళలకు మేలు జరగడం లేదన్నారు. రౌడీలకు పెరోల్ ఇప్పించి సొమ్ము చేసుకోవడంలో ఒక మంత్రి, కుట్టు మిషన్ పేరుతో దోచుకోవడంలో మరో మహిళా మంత్రి,వరలక్ష్మీ వ్రతం పేరుతో కానుకలు కొల్లగొట్టేయడంలో ఇంకో మహిళా మంత్రి బిజీగా ఉన్నారని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలంతా కూటమి (కే ట్యాక్స్) ట్యాక్స్ వసూలు చేయడంలో బిజీగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా తన వారికి కట్టబట్టేస్తున్నారని తెలియజేశారు. మహిళల మీద చెయ్యేస్తే తాట తీస్తామని హెచ్చరించే పవన్ కళ్యాణ్ సుగాలి ప్రీతి కేసును రాజకీయాలకు వాడుకున్నాడని, ఆ కుటుంబానికి ఏదైనా న్యాయం జరిగింది అంటే నాటి సీఎం వైయస్ జగన్ వల్లనే,ఆ కుటుంబానికి రూ. 8.25 లక్షల పరిహారం,ఇంటి స్థలం, బాధితురాలి తండ్రికి ఉద్యోగం ఇచ్చి వారిని ఆదుకున్న ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చాక సుగాలి ప్రీతి కేసును ప్రథమ ప్రాధాన్యంగా స్వీకరించి న్యాయం చేస్తానని అధికారంలోకి వచ్చిన పవన్ కళ్యాన్16 నెలలుగా సుగాలి ప్రీతి కేసు గురించి ప్రస్తావించలేదన్నారు. కనీసం సుగాలి ప్రీతి తల్లి పార్వతికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సుగాలి ప్రీతి కేసును రాజకీయ లబ్ధి కోసమే పవన్ కళ్యాణ్ వాడుకున్నాడని, పవన్‌కి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సుగాలి ప్రీతి కేసులో సీబీఐ విచారణకు కేంద్రాన్ని కోరాలన్నారు. ఆగస్టు 2017లో చంద్రబాబు సీఎంగా ఉండగా ఈ ఘటన జరిగితే సాక్ష్యాలను తారుమారు చేశారని వైయస్సార్సీపీ మీదకి నెపాన్ని నెట్టేలా పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నాడని, ఘటన జరిగిన తర్వాత దాదాపు రెండేళ్లు చంద్రబాబు సీఎంగా ఉంటే ఆయన్ని నిందించకుండా అండగా నిలవడం దేనికి సంకేతమని వరుదు కళ్యాణి ప్రశ్నించారు.

మహిళల ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా ఎన్నికల్లో కూటమి నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని అమలు చేసిన పాపాన పోవడం లేదన్నారు. మహిళలకు రాష్ట్రంలో రక్షణ కరువైందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడినా తమకు ఏమీ కాదనే భరోసా నేరస్తులకు ఉంటోందని,పేరుకి మాత్రం ఆడవారి మీద చెయ్యేస్తే అదే ఆఖరి రోజు అవుతుందని మైకుల ముందు గొప్పగా ఊదరగొడుతున్నారని అన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే అండగా ఉండి ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కళ్యాన్ పత్తా లేకుండా పోయాడని విమర్శించారు. ప్రశ్నించిన వారి మీద కక్షకట్టి అక్రమ కేసులు పెట్టడమే ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. చంద్రబాబు ఈ ఏడాది పాలనలో వేధింపులకు ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదన్నారు. వైయస్ జగన్‌ని సీఎం చేసేదాకా మహిళలమంతా ఈ ప్రభుత్వంపై పోరాడతామని కాకాణి పూజిత,వరదు కళ్యాణి లు స్పష్టం చేశారు.

---

## వైసీపీ నేతలను సన్మానించిన నియోజకవర్గ

# మహిళా విభాగం అధ్యక్షురాలు




**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత లను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా. రత్నశ్రీ ఘనంగా సన్మానించారు. శుక్రవారం నెల్లూరులో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జోనల్ సమావేశంలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా. రత్నశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరదు కళ్యాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత లకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నెల్లూరు నగరంలోని మాజీ మంత్రి కాకాణి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తోపాటు కాకాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి, సన్మానించారు.



---

# అన్నదానం మహాపుణ్యం





**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, ఆగస్టు 29:** అన్నదానం మహాపుణ్య కార్యక్రమం అని కొనియాడారు అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి. రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డు మార్గంలో ఎమ్మెస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని ఆయన దర్శించుకున్నారు. వారికి కమిటీ నిర్వాహ కులుతో పాటు టిడిపి నేత మడితాటి శ్రీనివాసులు రెడ్డి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మడితాటి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వినాయక చవితి నవరాత్రులను భక్తితో నిర్వహించుకోవడం చాలా సంతోషదాయకం అన్నారు. అదే విధంగా కుల మతాలక˘తీతంగా, ఐకమత్యంగా సోదరభావంతో ఎటువంటి ఘటనలకు తావులేకుండా పండు గను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అన్నదానం ఏర్పాటు చేసిన మడితాటి శ్రీనివాసులు రెడ్డి వారి కుటుంబ సభ్యులకు విఘ్నేశ్వరుని చల్లని దీవెనలతో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సాధించాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమం లో కమిటీ నిర్వాహకులు జంగం రెడ్డి,సురేష్ రెడ్డి,చరణ్ రెడ్డి,మహమ్మద్,సోమారపు నాగార్జునచారి,రంజిత్ రాయల్,రామలింగ రెడ్డి,నాని,ఖాదర్ వలి తదితరులు పాల్గొన్నారు.

---

## సీఎం పర్యటన ఏర్పాట్లను

# పకడ్బందీగా చేపడుతున్నాం

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 29:** పేదలకు సేవలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1వ తేదీన రాజంపేట మండలం బోయనపల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సబ్ కలెక్టర్ భావన, టిడిపి ఇన్చార్జ్ జగన్మోహన్ రాజుతో కలిసి బోయనపల్లి గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలిపాడ్, ప్రజావేదిక, లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు శనివారం సాయంత్రానికి పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా పథకం సిద్ధం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )